

గరుడ వాహన విహారి

అలరించిన ఖాద్రీశుడి వేడుక

నేడు శ్రీదేవి భూదేవి సమేతుడై.. శేష వాహనంపై విహారం (6లో)



రంగుల హోలీ

ప్రశాంతి నిలయంలో ఘనంగా వేడుకలు



సంప్రదాయ నృత్య రూపకం

పుట్టపర్తి రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలో హోలీ సంబరాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. హోలీ సందర్భంగా బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన బాలవికాస్ సేవా ఆర్గనైజేషన్ చిన్నారులు సాయిరంగోత్సవ్ పేరిట నిర్వహించిన సంగీత, సాంస్కృతిక, నృత్యరూపకాలు భక్తులను అలరించాయి. ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో వేదపఠనం అనంతరం శ్రీసత్యసాయిచాలీసాను పఠించారు. సాయంత్రం సాయిభక్తులు మూడో రోజు పర్తీయాత్రలో భాగంగా ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఉదయం వేదపఠనం అనంతరం భక్తిగీతాలను ఆలపించారు. సాయంత్రం రెండు రాష్ట్రాలకు చెందిన బాలవికాస్ సేవాఆర్గనైజేషన్ విద్యార్థులు బృందావనంలో బాలకృష్ణుడు గోపికలతో ఆడిన హోలీ సన్నివేశాలతో ఆహూతులను అలరించారు. మహామంగళహారతి అనంతరం సత్యసాయి భక్తులు మహాసమాధిని దర్శించుకున్నారు.

● జిల్లావ్యాప్తంగా ప్రజలు హోలీ పర్వదినాన్ని ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. రంగులను చల్లుకుంటూ సందడి చేశారు. పట్టణంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి.



అరటితోటలోని గెలలు

అరటి రైతులతో ఆటలు

ధరలను తగ్గించిన దళారులు

ధరలు బాగా పలుకుతున్నాయి.. దిగుబడి కూడా బాగా వచ్చింది అని ఆనందపడుతున్న అరటి రైతులకు రెండు వారాల్లో పరిస్థితి తలకిందులయింది. రైతుల ఆశలు ఆవిరయ్యాయి. గెలలు నింపుకుని రైలు ఢిల్లీకి వెళుతోంది. మరోవైపు విదేశాల ఎగుమతికి అనుమతించారు. మరి ధరలు ఎందుకు పడిపోతున్నాయంటే.. దళారుల మాయాజాలమే. వారిని అదుపు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు.

- నెల కిందట టన్ను రూ.26 వేలు
- ఇప్పుడు రూ.11వేల నుంచి18 వేలు

తాడిమర్రి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అరటికి ధర బాగా ఉంది.. దిగుబడి కూడా బాగానే వచ్చింది.. ఇక అప్పులు తీరిపోతాయని ఆశపడ్డ రైతుల ఆశలు అడియాశలయ్యాయి. నెల రోజుల క్రితం టన్ను రూ.26వేలు పలికిన అరటి కాయలు ఇప్పుడు రూ.15 నుంచి రూ.18వేలకు పడిపోయాయి. రూ.26వేలు ధర పలికినప్పుడు ఎగుమతికి అనుమతి లేకపోయినా ధర బాగానే ఉండేది. ఎగుమతికి అనుమతించిన తరువాత ధర పడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ఏ పంటకైనా ప్రభుత్వం విదేశాల ఎగుమతికి అనుమతిస్తే.. ఆ పంట ధర పెరుగుతుంది. అదేమి చిత్రమో కానీ అరటి కాయల ధరలు టన్నుకు రూ.10వేలు తగ్గింది. తాడిమర్రి మండలంలోని దాడితోట, నాయనపల్లి, తురకవారిపల్లి, కునుకుంట్ల, రామాపురం, చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో అరటి పంట అధికంగా సాగు చేస్తున్నారు. ఎకరాలో 1200 మొక్కలు నాటి, దిగుబడి సాధించేంతవరకు రూ.లక్షకు పైగా ఖర్చు చేస్తున్నారు. సేద్యం పనులు, మొక్కలు, ఎరువులు, పురుగు మందులు, గెలలు వాలకుండా కట్టెల కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారు. ఏడాది పొడవునా జాగ్రత్తగా గమనించుకుని ఎరువులు, పురుగు మందులు వాడితే తప్పా నాణ్యమైన దిగుబడి సాధించలేరు. ఇలాంటి పరిస్థితుల్లో నాణ్యమైన అరటి గెలలను ఎగుమతికి అనుమతించి రైతుకు మరింత లాభం చేకూర్చాలనుకున్న కూటమి ప్రభుత్వ లక్ష్యాన్ని దళారులు తుంగలో తొక్కారు. ఎక్కడా లేనివిధంగా అనంతపురం జిల్లా నుంచి అరటి గెలలు నింపుకుని ఒక రైలు ఢిల్లీకి వెళ్లినా.. ఇక్కడ ధరలు తగ్గాయంటే ఎవరి ప్రమేయం ఉందో ఇట్టే తెలిసిపోతుంది. ఇప్పుడున్న పరిస్థితులలో వ్యవసాయానికి సాగునీరు తగ్గుతుండటంతో.. రైతులు తమ అరటి పంటను అమ్ముకోకుండా తోటలోనిలుపుకునే పరిస్థితిలేదు. అధికారులు, ప్రభుత్వ పెద్దలు స్పందించి అరటి పంటకు మంచి ధర పలికేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



గెలల నాణ్యతను చూపుతున్న రైతు

టన్ను రూ.25వేలు పలికితే లాభాలు



మూడు ఎకరాలలో దాదాపు నాలుగు వేల అరటిమొక్కలు సాగుచేశాను. ఇందుకు రూ.4.50 లక్షలు ఖర్చయింది. టన్ను రూ.25వేలు చొప్పున అమ్మడంతో మంచి లాభాలే వచ్చాయి. ఈ మాత్రం ధర పలికితే రైతులు మరింత ఉత్సాహంగా మంచి దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

- రామకృష్ణారెడ్డి, రైతు, కునుకుంట్ల

టన్ను రూ.17వేలకు అడుగుతున్నారు



ఇప్పుడు అరటి ధరలు పడిపోయాయని వ్యాపారులు పొలం వద్దకు రాలేదు. దీంతో భయపడి అరటి పంటను అమ్ముకుంటున్నారు. టన్ను రూ.17వేలతో అడుగుతున్నారు. అదేమంటే ఎండలకు అరటి పంటదెబ్బతింటోందని, కాబట్టి ధర పలకలేదని ఉత్తుత్తి మాటలు చెబుతున్నారు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

- గోపాల్‌నాయుడు, రైతు, దాడితోట

ప్రభుత్వమే నియంత్రించాలి



అరటి పంట ఎగుమతికి అనుమతించినా ఫలితం లేకుండా పోతోంది. ధర తగ్గిందేకానీ పెరగలేదు. ప్రభుత్వమే ధరలను నిర్ణయించాలి. అప్పుడు దళారుల బెడద తగ్గి రైతుకు లాభం చేకూరుతుంది. లేదంటే పండినపంటలో దళారికి భాగం ఇవ్వాల్సి వస్తోంది.

- మణికంఠేశ్వరుడు, రైతు, దాడితోట

నేడు ఊరువాడ స్వచ్ఛాంధ్ర

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం గా చేపట్టిన స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రతి ఊరు, వాడలో శనివారం విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ఒకప్రకటనలో కోరారు. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు వాడకం వల్ల జరిగే అనార్థల గురించి అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంలో విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించాలన్నారు. పాఠశాలలు, వసతిగృహాలు, కళాశాలు, పరిశ్రమలు, ఆర్టీసీ బస్టాండ్లు, కూరగాయల మార్కెట్లు, రైతు బజారులు, దేవాలయాలు, ఆసుపత్రులు, ప్రజలు అధికంగా సంచరించే ప్రధాన కూడలిల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈకార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. ఆయా శాఖల అధికారులు చేపట్టే పారిశుధ్య కార్యక్రమాలను ఫొటోలు తీసి స్వచ్ఛంధ్ర వెబ్‌సైట్‌లో పొందుపరచాలని కోరారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 శనివారం సాయంత్రం	5.06 ఆదివారం ఉదయం
కదిరి	6.30 శనివారం సాయంత్రం	5.09 ఆదివారం ఉదయం
ధర్మవరం	6.33 శనివారం సాయంత్రం	5.05 ఆదివారం ఉదయం
హిందూపురం	6.33 శనివారం సాయంత్రం	5.13 ఆదివారం ఉదయం
పెనుకొండ	6.33 శనివారం సాయంత్రం	5.13 ఆదివారం ఉదయం

ఉష్ణోగ్రతలు



శుక్రవారం

గరిష్ఠం	38.0
కనిష్ఠం	23.0

వారానికి.. వందకు రూ.10

బరితెగిస్తున్న వడ్డీ వ్యాపారులు

చెల్లించకపోతే బూతులు.. దాడులు

ధర్మవరంలో రూ.కోట్లలో కాల్‌మనీ దందా





● ధర్మవరం మండలం చిన్నూరుబత్తలపల్లికి చెందిన మధుసూదన్ ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి అప్పు తీసుకున్నాడు. అప్పు సకాలంలో చెల్లించకలేదు. దీంతో పట్టణంలోని మార్కెట్‌యార్డ్ వద్దగల టీకేఫ్‌లో మధుసూదన్ ఉండగా అప్పు ఇచ్చినవారు అక్కడికి వెళ్లి దుర్భాషలాడారు. దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ధర్మవరం పట్టణంలో నిత్యం ఏదో ఒక చోట కాల్‌మనీదారులు దౌర్జన్యం సాగిస్తునే ఉన్నారు.

ధర్మవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కాల్‌మనీదారుల దాష్టీకాలతో అప్పుతీసుకున్న వారు బెంబేలెత్తిపో తున్నారు. మనిషి అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు సిండికేట్‌గా మారి అధికవడ్డీలకు అప్పులు ఇస్తున్నారు. ఆపై వసూళ్లతో తమ పైశాచికత్వాన్ని చాటుతున్నారు. పట్టణంలో వారాల వడ్డీ దోపిడీ పెరిగింది. రూ.100 లకు వారానికి రూ.10చొప్పున వడ్డీకి ఇస్తున్నారు. అవసరార్థం తీసుకున్న వారు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో దాడులు, దౌర్జన్యాలకు గురి అవుతున్నారు. కొందరు వీరి బాధలు భరించలేక ఇతర ప్రాం తాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు. మరి కొందరు అవమానాలు భరించలేక ఉన్న ఆస్తులు, చివరికి భార్య పుస్తెలు సైతం తాకట్టు పెట్టిఅప్పు చెల్లిస్తున్నారు. అయితే ఆ మొత్తాన్ని వడ్డీకే సరి చేసుకుని, మళ్లీ అసలు డిమాండ్ చేస్తుండటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో వారు ఉండిపోతున్నారు. పట్టణ శివారు ప్రాంతాలైన శాంతినగర్, చంద్రబాబునగర్, చెన్నకేశవపురం, శివానగర్, కొత్తపేట, దుర్గానగర్ తదితర ప్రాంతాలలో వారాల వడ్డీ వ్యాపారం ఎక్కువగా కొనసాగుతోంది. మొత్తంగా కాల్‌మనీ వ్యాపారం రూ.కోట్లలో టర్నోవర్ జరుగతున్నట్లు సమాచారం. దీనిపై పోలీసు యంత్రాంగం కానీ ప్రభుత్వం కానీ దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

దాడులు, వేధింపులు

అప్పు తీసుకున్న వారు చెప్పిన సమయానికి చెల్లించలేకపోతే ఇంటికి వెళ్లి నానా దుర్భాషలాడుతున్నారు. భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. రూ.లక్ష అప్పు తీసుకుంటే వారానికి రూ. 10వేలు చొ ప్పున వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన నెలకు రూ.40వేలదాకా ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు పలువురు బాధితులు వాపోతున్నారు. వడ్డీ ఇవ్వలేని పక్షంలో ఇంటిలోకి ప్రవేశించి ఇంటిలో ఉన్న విలువైన వస్తువులను సైతం ఎత్తుకెళుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కాల్‌మనీదారుల బెదిరింపులకు భయపడి పోలీసులను ఆశ్రయించడానికి కూడా చాలామంది భయపడుతున్నట్లు సమాచారం.

మా దృష్టికి రాలేదు..



ధర్మవరంలో కాల్‌మనీ వ్యవహారం నా దృష్టికి వచ్చిం ది. అయితే కాల్‌మనీ బాధితులు ఎవరు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదు. ఎవరైన వచ్చి ఫిర్యాదు చేస్తే వడ్డీ వ్యాపారులపై చర్యలు చేపడతాం.

- హేమంత్‌కుమార్, డీఎస్పీ, ధర్మవరం

శక్తి యాప్‌పై అవగాహన పెంచండి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మహిళలు, అమ్మాయిల భద్రతే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం రూపొందించి, అమలులోకి తెచ్చిన శక్తియాప్‌పై జిల్లాలో విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ వి.రత్న పోలీసు అధికారులను శుక్రవారం ఆదేశించారు. జిల్లాలోని ప్రతి మహిళ శక్తి యాప్ ‌ డౌన్‌లోడ్ చేసుకుని, ఆపద సమయాల్లో పోలీసుల రక్షణ పొందేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. వేధింపులు, అత్యాచారాలు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించడానికి ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.



కార్పొరేషన్లు ఖాళీ

- బీసీ, ఎస్సీ కార్పొరేషన్లలో అధికారుల కొరత
- కీలక పోస్టులు ఖాళీ
- రుణాల ప్రక్రియలో ఇబ్బందులు

(వివరాలు 6లో...)

జిల్లాలోని ఎస్సీ, బీసీ కార్పొరేషన్లు ఖాళీ అయిపోయాయి. అధికారుల సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఏళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో కార్పొరేషన్లలో అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించడం లేదనే చెప్పాలి. ఎస్సీ కార్పొరేషన్‌లో అత్యంత ప్రాధాన్యత ఉన్న ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆర్థికపరమైన అంశాలతో ముడిపడిన ఆ పోస్టులు ఏళ్లుగా ఖాళీగా ఉండటం గమనార్హం. ఈడీ పోస్టే కొన్ని నెలలుగా ఖాళీగా దర్శనమిస్తోంది. ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీంతో పాలనాపరమైన అంశాల్లో సమస్యలు తలెత్తుతున్నట్లు ఆ శాఖలోని అధికారులు పేర్కొంటున్నారు. ఇక బీసీ కార్పొరేషన్‌లో సైతం అధికారుల కొరత పట్టి పీడిస్తోంది. ఆ కార్పొరేషన్‌లో ఒక ఏఈఓ, రెండు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ పడ్డాయి. ప్రస్తుతం ఆయా కార్పొరేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ రుణాల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో అధికారుల కొరత పెద్ద తలనొప్పిగా మారిందనే చెప్పాలి. ఇప్పటికైనా పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. -ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం (పెన్నార్ భవన్)



కార్పొరేషన్లు ఖాళీ!

బీసీ, ఎస్సీ కార్పొరేషన్లలో అధికారుల కొరత

- కీలక పోస్టులు ఖాళీ
- రుణాల ప్రక్రియలో ఇబ్బందులు



బీసీ కార్పొరేషన్‌లోనూ..

బీసీ కార్పొరేషన్‌లో ఈడీ దిగువస్థాయిలో ఉండే ఏఈఓ అధికారి గతేడాది ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఆ పోస్టులో ఎవరినీ నియమించలేదు. కార్పొరేషన్‌లో రెండు సీనియర్ అసిస్టెంట్ ఖాళీలున్నాయి. ప్రస్తుతం బీసీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాల ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో ఈడీతోపాటు మరో అధికారి మాత్రమే తంటాలు పడుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లాను సైతం అనంత జిల్లా అధికారులే పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో ఆ జిల్లాలో సైతం సమస్య ఉత్పన్నమవుతోంది. గతంలో ఇక్కడున్న ఏఈఓ స్థాయి అధికారికి శ్రీసత్యసాయి జిల్లా కార్పొరేషన్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం అక్కడ అధికారుల కొరత ఏర్పడటంతో సమస్య తీవ్రమవుతోందనే చెప్పాలి.

రెగ్యులర్ ఈడీ లేక..

ఎస్సీ కార్పొరేషన్‌లో కీలకమైన ఈడీ పోస్టు నాలుగైదు నెలలుగా ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఆ పోస్టును ఎస్సీ సంక్షేమశాఖ డీడీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ పోస్టుతో ఎస్సీ కార్పొరేషన్‌లో రెండు చొప్పున ఈఓ, ఏఈఓ, సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని వెంటనే భర్తీ చేయాల్సి ఉన్నా.. జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ శాఖలో ఉన్న నలుగురైదుగురు ఉద్యోగులు కూడా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారే. కార్పొరేషన్‌లో గతంలో సబ్సిడీ రుణాలు, వాహనాలు తీసుకున్న వారి నుంచి రికవరీ చేయడం పెద్ద సమస్యగా మారిందనే చెప్పాలి. ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్‌లో పలు రకాల సబ్సిడీ రుణాలకు సంబంధించిన ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలోనే ఆ రుణాల ప్రక్రియ మొదలు కానుంది. ఇప్పటికీ పాత బకాయిలను రికవరీ చేసేందుకే తంటాలు పడుతున్న సిబ్బంది... కొత్తగా రుణాల ప్రక్రియ మొదలైతే అంతే సంగతులంటూ వాపోతున్నారు.

కొరత వాస్తవమే..



ఎస్సీ కార్పొరేషన్‌లో అధికారుల కొరత ఉన్న మాట వాస్తవమే. రెండేసి ఈఓ, ఏఈఓ, సీనియర్ అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రికవరీలో కొంత ఇబ్బందిగా ఉన్నప్పటికీ అనుకున్న మేరకు చేస్తున్నాం. అధికారుల కొరతపై ఉన్నతాధికారులకు వివరించాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-రాధిక, ఇన్‌చార్జి ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

కావాలని అడుగుతున్నాం



బీసీ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న ఏఈఓ, రెండు సీనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం రుణాల ప్రక్రియ సాగుతుండడంతో పర్యవేక్షణ నిమిత్తం ఇతర శాఖల నుంచి అధికారులను సర్దుబాటు చేయాలని కోరాం. ఎవరైనా ముందుకొస్తే.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియమించుకుంటాం.

-సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్

చెయ్యికి చెయ్యి.. తలకు తల

వైసీపీ నేత రెచ్చగొట్టే వ్యాఖ్యలు



హిందూపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ వర్గీయులపై దాడులను సహించం. ఇకపై చెయ్యికి చెయ్యి.. తలకు తల..' అని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక భర్త, ఆ పార్టీ నేత వేణురెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. జంగాలపల్లి టీడీపీ దళిత నాయకుడు సాయికుమార్, ఆయన భార్యపై అదే గ్రామానికి చెందిన మాజీ వలంటీరు అశ్వర్థ, దేవేగౌడ, మరొకరు గురువారం రాత్రి దాడిచేశారు. ఈ గొడవవలో ఇరువర్గాలవారికీ గాయాలయ్యాయి. పాత కక్షల కారణంగా ఈ గొడవ జరిగిందని పోలీసులు తెలిపారు. గాయపడ్డ ఇరువర్గాల వారు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వేణురెడ్డి, ఇతర నాయకులు శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. తమ పార్టీ వర్గీయులను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. దాడులు పునరావృతం అయితే చెయ్యికి చెయ్యి, కాలుకు కాలు, తలకు తల ఉంటుందని హెచ్చరించారు. ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకునే అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు.

నేత్రపర్వంగా కల్యాణం

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాడికి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాడికిలోని చెన్నకేశవస్వామి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ కట్టపై సంప్రదాయబద్ధంగా బ్రాహ్మణుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్‌డీ శశికళ, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా రథోత్సవం

చెన్నకేశవస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం తేరు మిద్దె వద్ద నుంచి స్థానిక కెనరా బ్యాంక్ వరకు మడుగు తేరు లాగారు. భోజన విరామ అనంతరం రథోత్సవాన్ని కొనసాగించారు. రథోత్సవంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యాడికిలోని మార్కెట్‌యార్డులో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.



చెన్నకేశవస్వామి రథోత్సవం

వాననీటిని ఒడిసిపట్టే నీటికుంటలు

ఫాంపాండ్ వద్ద ఏర్పాటు చేసిన బోరు ద్వారా నీటిని తోడుతున్న రైతులు



ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు ఎన్నో చేయవచ్చు. కొండల్లో, గుట్టల్లో ప్రయోజనం లేని పనులు ఎక్కువ చేస్తుంటారనే అభిప్రాయం విస్తృతంగా ఉంది. కానీ, రైతుల పొలాల్లో చేపడుతున్న నీటికుంటలతో ఎంతో ఉపయోగం ఉంటుంది. వర్షపు నీటిని ఒడిసి పట్టడమే కాకుండా.. నిల్వచేసిన నీటిని పండ్లతోటలకు ఉపయోగించవచ్చు. బోర్ల సమీపంలో నీటికుంట తవ్వుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయి. జిల్లాకు 5,780 నీటికుంటల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 872 మాత్రమే పూర్తి చేశారు. కొందరు ఏపీఓల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.



నీటికుంట తవ్వకం పనుల్లో ఉపాధి కూలీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో నీటికుంటలు తవ్వకానికి డ్వామా అధికారులు సిద్ధమయ్యారు. ఇటు రైతులకు, అటు ఉపాధి కూలీలకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. రైతులకు నీటికుంట తవ్వకంతో పాటు ఉచితంగా 10 రకాల పండ్లమొక్కలు, కూరగాయలు, తీగజాతి మొక్కలు అందజేస్తారు. ఒక్కో నీటికుంట తీయడానికి 200 పనిదినాలు నమోదవుతాయి. 2లక్షల లీటర్ల నీటిని నిల్వచేసే అవకాశం ఉంది. వర్షపునీరు రైతు పొలాల నుంచి బయటకు వెళ్లకుండా అక్కడే ఈ కుంటల్లో నిల్వచేయవచ్చు. నిల్వచేసిన నీటిని పశువులు, పక్షులు, పంటలకు పురుగుమందు చల్లేందుకు ఉపయోగించుకోవచ్చు. జిల్లాకు 5,780 నీటికుంటల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 872 పూర్తి చేశారు. ఈనెలాఖరులోపు లక్ష్యాన్ని పూర్తి చేస్తే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా జిల్లాలో వీటిని ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నీటికుంట ఎందుకంటే..?

రైతులు తమ పొలంలో వచ్చే వర్షపునీటిని నిల్వచేసుకునేందుకు, రైతు పొలంలోనే ఏర్పాటు చేసుకునే చిన్ననీటి మడుగులను ఫాంపాండ్ లేదా నీటికుంట అంటారు. ఎండాకాలంలో పొలంలో పశువులకు, పక్షులకు తాగునీరు అందించేందుకు పండ్లతోటల పెంపకానికి, పరిమిత ప్రాంతంలో కూరగాయల పెంపకానికి, పంటలకు పురుగు మందులను చల్లేందుకు అవసరమైన నీటిని ఈ నీటికుంట అందిస్తుంది. రైతులు తమ పొలంలో పడిన వర్షపునీరంతా ఒకేవైపు చేరడానికి అవకాశం ఉండి, నీరు నిల్వచేసేందుకు అనుకూలంగా ఉన్న పొలంలోని పల్లపు ప్రాంతాన్ని గుర్తించాలి.

లక్ష్యానికి దూరంగా..

జిల్లాలో ఈ ఏడాదిలో 5,780 నీటికుంటలను నిర్మించాలని డ్వామా అధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకు 4,941 నీటికుంటల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. వీటిలో 872 పూర్తి చేయగా, 1824 నిర్మాణదశలో ఉన్నాయి. నీటికుంటల నిర్మాణంలో జిల్లాలో చాలా మండలాలు వెనుకబడి ఉన్నాయి. బొమ్మనహాళ్, గుత్తి, కళ్యాణదుర్గం, కణేకల్లు, కూడేరు, ఉరవకొండలో ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. గుంతకల్లు, రాప్తాడు, యల్లనూరు, బెళుగుప్ప, విడపనకల్లు, రాయదుర్గం, పామిడి, డి.హీరేహాల్, అనంతపురం రూరల్, గార్లదిన్నె, కంబదూరు మండలాలు 10 నీటికుంటలు కూడా దాటలేదు. కరువు మండలాలు నార్పల, రాప్తాడు, విడపనకల్లు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, యాడికి, అనంతపురం రూరల్ మండలాల్లో అదనంగా ఉపాధి కూలీలకు 50రోజుల పనిదినాలు కల్పిస్తూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.



పూర్తయిన నీటి కుంట

పండ్లతోటల రైతులకు ఉపయోగం

కూలీలకు ఉపాధి

5,780 లక్ష్యం.. 872 మాత్రమే పూర్తి

పలు మండలాల్లో నిర్లక్ష్యం

రైతులకు ఉపయోగకరం



జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న నీటికుంటలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వర్షపునీరు పడే చోట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోకుండా నీటికుంటల్లో నిల్వచేయవచ్చు. దీంతో నిల్వచేసిన నీటిని రైతులు అనేకరకాలుగా ఉపయోగించుకోవచ్చు. జిల్లాలో రైతులకు అవగాహన కల్పించి పొలంలో ఫాంపాండ్లు తవ్వుకునేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. చాలా మండలాలు వెనుకబడి ఉన్నాయి. ఆయా మండలాల ఏపీఓలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చి వేగవంతం చేయాలని ఆదేశించాం. నీటికుంటల నిర్మాణంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కలెక్టర్ ఆదేశాలతో సమష్టిగా కృషి చేస్తున్నాం.

-సలీంబాషా, డ్వామా పీడీ

సంచార పశువైద్యం బంద్..!

తొలి విడతలో 7 వాహనాల నిలిపివేత

డాక్టర్లు, సిబ్బందికి సమాచారమే ఇవ్వని వైనం

కాంట్రాక్టు ముగియడంతో నిలిపివేశామంటున్న యంత్రాంగం

ఆయా ప్రాంతాలకు నిలిచిన సేవలు

రైతులు, పశువుల కాపర్లకు తిప్పలు



పశు సంచార వాహనం

అనంతపురం అర్బన్/విడపనకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచార పశు వైద్య సేవలు నిలిచిపోయాయి. 2022 సంవత్సరంలో తొలి విడత కింద జిల్లా వ్యాప్తంగా ఏడు పశు సంచార వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. నియోజకవర్గ కేంద్రంలోని పశువుల ఆసుపత్రుల్లో ఆయా వాహనాలను ఉంచి, వచ్చిన కాల్ ఆధారంగా సేవలు అందిస్తూ వస్తున్నారు. అప్పట్లో జీవీకే సంస్థకు సంచార వాహనాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16తో ఆ సంస్థతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం పూర్తయింది. దీంతో తొలి విడతలో మొదలు పెట్టిన పశు సంచార వాహనాలను నిలిపివేశారు. సంచార వాహనాల్లో విధులు నిర్వర్తిస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వాహనాలను అర్థంతరంగా నిలిపేశారు. యథావిధిగా విధులకు వెళ్లిన వెటర్నరీ డాక్టర్లు, సిబ్బందికి చేదు అనుభవం ఎదురైంది. వాహనాలను నిలిపివేశామని, ఇక నుంచి విధులకు హాజరుకావాల్సిన అవసరం లేదని అక్కడి అధికారులు చెప్పారు.

సగం మండలాలకు నిలిచిన సేవలు

అనంతపురం అర్బన్, శింగనమల, ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ కేంద్రాల్లో 2022 సంవత్సరంలో తొలి విడతలో పశు సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నెంబర్ 1962కు రైతులు ఫోన్ చేసిన ప్రాంతాలకు సంచార వాహనంలో వెళ్లి పశువులు, మూగజీవాలకు వైద్యం అందిస్తున్నారు.

రెండో విడతలో 2023 ఫిబ్రవరి నుంచి అనంతపురం రూరల్, పుట్లూరు, యాడికి, గుత్తి, కూడేరు, శెట్టూరు, కణేకల్లు మండల కేంద్రాల్లో మరో ఏడు పశు సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. ఫోన్ కాల్స్ ఆధారంగా క్షేత్రస్థాయికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16 నుంచి తొలి విడతకు చెందిన పశు సంచార వాహనాలను నిలిపివేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా సగం మండలాల్లోని పశువులు, మూగజీవాలకు సంచార సేవలు పూర్తిగా బంద్ అయ్యాయి. తిరిగి ఆయా ప్రాంతాలకు పశు సంచార వాహనాలను ఎప్పుడు పంపుతారో తెలియని అయోమయం ఏర్పడింది.



పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది (ఫైల్)

వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది ఆందోళన

పశు సంచార వాహనాల ద్వారా వైద్య సేవలు అందించేందుకు వెటర్నరీ డాక్టర్లు, అసిస్టెంట్లు, డ్రైవర్లను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. ఒక్కో వాహనంలో ఒక వెటర్నరీ డాక్టర్, పారావెట్ (వెటర్నరీ అసిస్టెంట్), పైలెట్ (డ్రైవర్) పనిచేస్తున్నారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న జీవీకే సంస్థ ద్వారా వీరికి వేతనాలు ఇస్తున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఉన్నట్లుండి వాహనాలు నిలిపివేయడంతో తాము రోడ్డుమీద పడ్డామని వారు ఆవేదన చెందుతున్నారు. సంచార వాహనాలు తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారు..? తమను ఉద్యోగంలోకి తీసుకుంటారా..? లేదా అనే కనీస సమాచారం కూడా ఎవరూ ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం ఎదుట బాధిత వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు.

సంచార సేవలను ప్రారంభించాలి



నాకు కాడెద్దులు, ఆవు, ఎనుము ఉన్నాయి. గతంలో సంచార పశు వాహనం ఊళ్లోకి వచ్చేది. ఫోన్ చేస్తే వచ్చి పశువులకు చికిత్స అందించేవారు. పశువులు నడవలేని స్థితిలో ఉన్నప్పుడు సంచార వాహన సేవలు ఎంతో ఉపయోగపడ్డాయి. మూడు వారాలుగా సంచార వాహనం రాలేదు. సంచార వాహనాన్ని తిరిగి ఏర్పాటు చేసి, పశువులకు వైద్య సేవలు అందించాలి.

-గంగన్న, రైతు, విడపనకల్లు

జీవాలకు చికిత్స చేసేవారు



గొర్రెలు, మేకలను సాకుతూ జీవనం సాగిస్తున్నా. అత్యవసరంగా గొర్రెలు, మేకలకు చికిత్స అవసరమైతే సంచార వాహనం నెంబర్ 1962కు ఫోన్ చేస్తే నేరుగా వాహనంలో డాక్టర్, సిబ్బంది వచ్చేవారు. జీవాలకు అవసరమైన చికిత్సలు చేసేవాళ్లు. ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు ఏదైనా జీవాలకు చికిత్స చేయించాలంటే పశువుల ఆసుపత్రికే తీసుకువెళ్లాలి. సంచార వాహనాన్ని కొనసాగించాలి.

-రామాంజనేయులు, విడపనకల్లు

కాంట్రాక్టు పూర్తి కావడంతో ఆపేశారు

కాంట్రాక్టు కాలం పూర్తి కావడంతో తొలి విడతకు చెందిన సంచార పశుసేవా వాహనాలను నిలిపివేశారు. ఆయా వాహనాల్లో పనిచేస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది తిరిగి వాహనాలను ఏర్పాటు చేసి, తమకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతిపత్రం అందించారు. రైతుల నుంచి కూడా సంచార వాహనాలను పంపాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం.

-వెంకటస్వామి, జేడీ, పశుసంవర్ధక శాఖ

గరుడ వాహన విహారి

● అలరించిన ఖాద్రీశుడి వేడుక ● నేడు శ్రీదేవి భూదేవి సమేతుడై.. శేష వాహనంపై విహారం




బ్రహ్మగరుడ సేవలో స్వామివారు...

కదిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం ఉన్న బ్రహ్మగరుడ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. యాగశాలలో శ్రీవారికి ఉదయం నిత్యపూజ నిర్వహించి, తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం గరుడ వాహనంపై తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు వేదపండితులు గరుడ పూజను నిర్వహించారు. గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీవారిని తూర్పు రాజ గోపురం నుంచి దర్శించుకుంటే మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం, తిరు వీధులు కిక్కిరిసిపోయాయి. శ్రీవారికి ఊరేగింపు ముందు జానపద కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలలో శనివారం శేష వాహన సేవ నిర్వహిస్తారు. అన్ని వాహన సేవల్లో శ్రీవారు మాత్రమే తిరువీధులలో భక్తులకు దర్శనమిస్తారు. కానీ శేష వాహన సేవలో శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు తిరువీధుల్లో విహరిస్తారు.

కదిరి పున్నమి

కదిరి పున్నమిని పురస్కరించుకుని శ్రీవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏపీ, కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి మొక్కులను తీర్చుకున్నారు.

నేడు కదిరికి కొక్కంటి జ్యోతి



కొక్కంటి జ్యోతి (ఫైల్)

తనకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా కొక్కంటి పాలేగాళ్ల ఆధ్వర్యంలో నిర్వహించే కొక్కంటి జ్యోతి కార్యక్రమం శనివారం తెల్లవారుజామున మొదలవుతుంది. కదిరికి సాయంత్రంలోపు చేరుకుంటుందని కొక్కంటి పాలేగాడు వైవీ దినకర్‌నాయుడు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోందని తెలిపారు. కొక్కంటి పాలేగాళ్ల ఇంటిలో జ్యోతికి శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి క్షేత్రం మీదుగా కదిరికి చేరుకుంటుంది. తనకల్లు, నల్లచెరువు, అన్నమయ్య జిల్లా ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లి మండలాల భక్తులు కాలినడకన కదిరి బ్రహ్మోత్సవాలకు వెళ్లి, జ్యోతి కార్యక్రమంలో పాల్గొంటారు.



సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

జనషోన



పవనుడు అందరివాడు..

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.



మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు



జనసైనికా.. కూల్..కూల్..

పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహదూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.




జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..

క్రైం కార్నర్

పండగపూట పుత్ర శోకం

- బావిలో పడి విద్యార్థి మృతి



పునీత్‌కుమార్ మృతదేహం

రాప్తాడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగినేపల్లికి చెందిన విద్యార్థి పామళ్ల పునీత్‌కుమార్ (8) శుక్రవారం బావిలో పడి మృతిచెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... పామళ్ల నారాయణ స్వామి, లక్ష్మీదేవి దంపతుల ఏకైక కుమారుడు పునిత్ కుమార్ కనగానపల్లి మండలం తగరకుంటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. హోలీ పండుగ సందర్భంగా పాఠశాలకు శుక్రవారం సెలవు కావడంతో పునిత్ కుమార్ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి మధ్యాహ్నం పొలాల వద్దకు వెళ్లారు. రైతు శివయ్య పొలంలో బావి వద్ద చెట్ల గూడులో పావురాల గుడ్లు ఉండటంతో వాటిని తీసుకునేందుకు ముగ్గురు వెళ్లారు. పునిత్‌కుమార్ ముందువైపు ఉండటంతో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడ్డాడు. పునిత్ కుమార్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. తోటి విద్యార్థులు వెంటనే గ్రామంలోకి వెళ్లి పునిత్‌కుమార్ బావిలో పడ్డాడని గ్రామస్థులు, కుటుంబ సభ్యులకు తెలిపారు. గ్రామంలోని వ్యక్తులు హుటాహుటిన బావి దగ్గరకు వెళ్లారు. పునిత్‌కుమార్ కోసం బావిలో గాలించగా కనిపించకపోవడంతో అగ్నిమాపక, విపత్తుల శాఖ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చారు. అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ లింగమయ్య, ఫైర్ మెన్‌లు గోవిందరాజులు, శ్రావణ్‌కుమార్, జయరాముడు, తిప్పేస్వామి, అజయ్‌కుమర్‌లు బావిలో దిగి పునిత్‌కుమార్ మృతదేహంను బయటలకు తీశారు. తమ ఏకైక కుమారుడు మరణించడంతో పునిత్ కుమార్ తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్వంతమయ్యారు. రాప్తాడు సీఐ శ్రీ హర్ష సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

19 నుంచి న్యాయ విద్య పరీక్షలు

అనంతపురం సెంట్రల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో న్యాయ విద్య కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ నెల 19 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ తెలిపారు. ఎల్‌ఎల్‌బీ మూడు, ఐదు సంవత్సరాల విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిమర్ సైన్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీ విభాగాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ నెల 19 నుంచి 24వరకు ఆరు రోజులపాటు నిర్వహించే పరీక్షలకు దాదాపు 1,050 మంది విద్యార్థులు హాజరౌతారని తెలిపారు.

వైసీపీలో అలజడి.!

రాయదుర్గంలో నలుగురు కౌన్సిలర్లు, ఇద్దరు నాయకుల సస్పెన్షన్

- పార్టీకి రాజీనామా దిశగా మరికొందరు..
- మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా పావులు



మాట్లాడుతున్న బహిష్కృత కౌన్సిలర్లు, నాయకులు

రాయదుర్గం, మార్చి14(ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఒక్కసారిగా అలజడి రేగింది. పట్టణానికి చెందిన నలుగురు కౌన్సిలర్లతోపాటు ఇద్దరు సీనియర్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం దుమారం రేపింది. రాయదుర్గం వైసీపీలో ఇటీవల అసమ్మతి బలపడుతూ వస్తోంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వేదికగా రెండువర్గాలుగా విడిపోయి, తన్నుకునే స్థాయికి చేరారు. దీనిని సీరియస్‌గా పరిగణించిన అధిష్ఠానం సస్పెన్షన్‌తో క్రమశిక్షణ చర్యలకు శ్రీకారం చుట్టింది. మరికొందరిని త్వరలోనే సస్పెండ్ చేయనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాయదుర్గం మున్సిపల్ వైస్ చైర్మెన్ శ్రీనివాసులుయాదవ్, వలి, కౌన్సిలర్లు డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేశారు. డీ.హీరేహాళ్ మండల మాజీ కన్వీనర్ వన్నూరుస్వామి, రాళ్ల తిమ్మారెడ్డిని కూడా సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. శాసనసభ ఎన్నికల అనంతరం నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి ఒక్కసారిగా భగ్గుమంది. నాలుగేళ్లపాటు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన పొరాళ్ల శిల్పను గద్దె దింపడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. దీని కోసం నాలుగు నెలలుగా తీవ్ర కసరత్తు సాగుతోంది. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి చేరవేస్తూ వస్తున్నారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో 14 మంది సభ్యులు జట్టుగా ఏర్పడి కోరంలేకుండా చేసి చైర్‌పర్సన్‌ను గద్దె దింపే ప్రయత్నానికి పూనుకున్నారు. రెండు వర్గాలుగా ఏర్పడి వాగ్వాదం చేసుకోవడంతోపాటు తన్నుకునే స్థాయికి చేరారు. దీంతో వైసీపీ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. మున్సిపల్ కౌన్సిల్‌లో 32 మంది సభ్యుల్లో 29 మంది వైసీపీకి చెందిన వారున్నారు. వీరిలో 14 మందిదాకా తిరుగుబాటు చేస్తున్నారు. అధిష్ఠానం బుజ్జగించే చర్యలు చేపట్టినా వారు వెనక్కి తగ్గలేదు. పైగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న శిల్పను గద్దె దింపడానికి వైస్ చైర్మన్ వలి.. కొందరికి సొమ్ము చెల్లించి, తన వైపు తిప్పుకుంటున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా రెండు వర్గాలుగా ఏర్పడి, ఎవరికి వారు ఎత్తుగడలు వేస్తున్నారు. డీ.హీరేహాళ్ మండల మాజీ కన్వీనర్ వన్నూరుస్వామితోపాటు సీనియర్ నాయకుడు రాళ్ల తిమ్మారెడ్డి.. బీజేపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారంటూ చర్యలు తీసుకుంది. అసమ్మతి వర్గం.. వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ వస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సస్పెన్షన్ ఎలాంటి పరిణామాలకు తావిస్తుందోనన్న చర్చలు వినిపిస్తున్నాయి.

రాజీనామాకు సిద్ధంగా 8 మంది కౌన్సిలర్లు

తమపై చర్యలు తీసుకోవడంతో వైసీపీకి తీవ్ర నష్టం తప్పదని బహిష్కృత కౌన్సిలర్లు తెలిపారు. వైస్ చైర్మెన్ వలి, శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్లు డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డి, వన్నూరుస్వామి విలేకరులతో మాట్లాడారు. మరికొందరు కౌన్సిలర్లు, నాయకులు కూడా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. సస్పెన్షన్లతో పార్టీకి మరింత నష్టం తప్పదన్నారు. ఇంకా ఎనిమిది మంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు వెల్లడించారు. రాజీనామాకు సంబంధించి సంతకాలు చేసిన లేఖను చూపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను మార్చాలని 14 మంది కౌన్సిలర్లు.. సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని పలుమార్లు కోరామన్నారు. ప్రయోజనం లేదన్నారు. మెట్టు గోవిందరెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గద్దె దింపడం ఖాయమనీ, అవిశ్వాసం పెట్టి తీరుతామని వారు స్పష్టం చేశారు.

స్టీల్ ప్లాంట్‌కు గనులు.. నిధులు ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం గనులు, నిర్వహణ నిధులు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఓబులు మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తామని కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు ఎన్నికల ముందు హామీ ఇచ్చాయన్నారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ జనవరి 29న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి, ప్యాకేజీ ప్రకటించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులను అప్పులు తీర్చడానికే ఉపయోగించాలనీ పేర్కొనడం సరికాదన్నారు. కార్మికుల జీతాలు, ముడిసరుకు కొనుగోలు, నిర్వహణ పరికరాలు కొనేందుకు వినియోగించరాదని ప్రకటించారన్నారు. దీనిని బట్టి ప్యాకేజీ నిధులతో అప్పులు తీర్చి, ప్రైవేటు వారికి అప్పులులేని ప్లాంట్‌ను ధారాదత్తం చేయాలనే కుట్ర స్పష్టమవుతోందని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రధాన సమస్య సొంత గనులు లేకపోవడమేనన్నారు. నాణ్యమైన స్టీల్ ఉత్పత్తి చేస్తున్న ప్లాంట్‌కు సొంత గనులు ఎందుకివ్వరని ప్రశ్నించారు. సొంతగనులు ఉన్న ప్లాంట్‌కు టన్ను రూ.వెయ్యిలోపు ముడి ఇనుప ఖనిజం దొరుకుతోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మాత్రం మార్కెట్‌లో టన్నుకు రూ.6వేల నుంచి రూ.8వేల వరకు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ఈ భారమే ప్లాంట్‌ను కుంగదీస్తోందన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్, ఆటో కార్మిక నేతలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు

చట్టంపై చైతన్యం పెరగాలి

వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత



అనంతపురం క్రైం, మార్చి14(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రజల్లో చైతన్యం రావాల్సిన ఉందని వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత అన్నారు. అప్పుడే చట్టం లక్ష్యం నెరవేరుతుందన్నారు. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ప్రకటన విడుదల చేశారు. నాణ్యతలేని ఉత్పత్తులు, తప్పుడు ప్రకటనలు, అధిక ధరలు, సరైన సేవలు అందకపోవడం తదితరాల్లో పరిహారం కోసం వినియోగదారుల రక్షణ చట్టం-2019 అమలులో ఉందన్నారు. దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. ఉత్పత్తులు, సేవలతో నష్టపోతే పరిహారం పొందే హక్కు ఉందన్నారు. రూ.కోటిలోపు కేసులు జిల్లా కమిషన్ ఎదుట, రూ.కోటి-రూ.10కోట్ల పైబడిన కేసులు జాతీయ కమిషన్ ఎదుట దాఖలు చేయవచ్చన్నారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. నాణ్యతలేని ఉత్పత్తులకు తయారీదారులు, విక్రయదారులు, సేవాదారులందరూ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రెండేళ్ల కాలపరిమితికి లోబడి కమిషన్ ఎదుట ఫిర్యాదులు దాఖలు చేయవచ్చని ఆమె వివరించారు.

17న జాబ్‌మేళా

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పలు కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఈనెల 17వ తేదీన స్థానిక ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉప్పరపల్లి రోడ్డులోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, టాటా స్త్రైవ్, ఎంఎస్ఎన్ ఫార్మా లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంకాం చదివిన యువతీయువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి స్టైఫండ్‌తో కూడిన ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 8328368554, 9000024919, 9182063878 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని వివరించారు.

న్యూస్ బాక్స్

నేడు.. రేపు మంత్రి పర్యటన

ధర్మవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శని, ఆదివారాల్లో ధర్మవరంలో పర్యటిస్తారు. శనివారం ఉదయం 8.30 గంటలకు కొత్తపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్, మున్సిపల్ కార్మికులతో పరస్పర చర్చకార్యక్రమం, మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు ముదిగుబ్బ మండలం మలకవేముల హంద్రీనీవా కాలువలోని లైనింగ్ పనులకు శంకుస్థాపన, రెండు గంటలకు బత్తలపల్లిలో బీసీ హాస్టల్ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు బత్తలపల్లిలోని ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ భవనం ప్రారంభోత్సవం, మధ్యాహ్నం 12.30 గంటలకు బత్తలపల్లి మండలం అప్రాచెరువులో ఏర్పాటు చేసిన 24/7 పవర్ సప్లై అప్‌గ్రేడేషన్ కార్యక్రమంలో, మధ్యాహ్నం రెండు గంటలకు ఎన్డీఓ కార్యాలయంలో బీజేపీ మహిళా నేతలతో సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం గాయిత్రి బ్రాహ్మణసంఘం వారితో సమావేశంలో, సాయంత్రం ఐదు గంటలకు వైద్యాధికారుల సమావేశంలో మంత్రి పాల్గొంటారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రమేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లాలో ఏదేని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తులను మే 22వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా పంపాలని, వివరాలకు హెటీటీపీఎస్://ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్, లేదా హెటీటీపీఎస్:// సీఎస్‌సీ.ఏపీ.జీఓవీ.ఐఎన్, లేదా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



ధర్మవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణవీధిలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు ఆలయ ఈఓ వెంకటేశులు, ఆలయ అడహక్ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్ ఆధ్వర్యంలో జరిగాయి. శ్రీవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పోరాళ్లపుల్లయ్య, శిష్య బృందం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ఓబుళదేవరచెరువు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలం కుమ్మరిండ్లల్లో రైతు మహేష్ పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి.. అందులోని రాగి వైర్‌ను ఎత్తుకెళ్లారు. మహేష్ తన వ్యవసాయ బోరు వద్ద త్రీఫెస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులో ఉన్న కాపర్‌ను చోరీ చేశారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన మహేష్.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని విద్యుత్ సిబ్బంది పరిశీలించారు. ఇటీవల కాలంలో దుండుగులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైరును, బోరు కేబుళ్లను చోరీ చేస్తున్నారని, పోలీసులు వీటిపై నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

బుక్కపట్నం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుక్కపట్నంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు కేక్ కట్ చేసి, పంచారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి శ్రీనివాసులు, రమణ రాయల్, తోట అనిల్, లోకేష్, మహేష్, కూటమి నాయకులు సతీష్‌రాయల్, మంజు, సుధీర్ పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి వేడుకలు

ధర్మవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డ్ వద్దగల రమణ మహర్షి ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు చిప్పలవెంకప్ప ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా ఆశ్రమంలో అరుణాచల మహాదీపం వెలిగించి పూజలు చేశారు. లోక క్షేమం కోసం స్వచ్ఛమైన గోమాత నెయ్యితో దీపాన్ని వెలిగించారు. అనంతరం భక్తులు అక్షరమాణి మాలపారాయణం చేశారు.

అంతర్జాతీయ మహిళ దినోత్సవం



శాంతమ్మ, రమణమ్మను సన్మానిస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువగూటిబైలులో మహిళ దినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, దిగువగూటిబైలు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రమణమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ వలిబాషా, సర్పంచ్ విష్ణుమూర్తి, ఉప సర్పంచ్ కేశవ, తహసీల్దార్ దేవేంద్రనాయక్ పాల్గొన్నారు.

ఘనంగా కాటమయ్య స్వామి తిరునాళ్ల

బత్తలపల్లి, మార్చి ఆంధ్రజ్యోతి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వర ఉత్సవాలను మూడో రోజైన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి కాటమయ్యస్వామి కొండ వద్ద భారీ సంఖ్యలో భక్తుల నడుమ లంకాదహనం నిర్వహించారు. మండలంలోని ముస్టూరు గ్రామానికి చెందిన గ్రామస్థులు కరణం, వారి కుటుంబాన్ని ఊరేగింపుగా రెడ్డివారి ఇంటికి వెళ్లి.. అక్కడ తేనేటి విందు స్వీకరించారు. ఇరుకుటుంబాలు కలసి ఊరేగింపుగా కొండవద్దకు చెరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ ప్రభను తిరువీధుల్లో ఊరేగించి లంకాదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచాలు పేల్చారు. ఈ లంకదహన కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సాయంకాలం అనంతలక్ష్మి కళాశాల అధినేత అనంత లక్ష్మిరాముడు, డైరెక్టర్ రమేష్‌బాబు కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

శిథిలావస్థలో బుక్కపట్నం బస్టాండ్

● నిరుపయోగంగా మారిన వైనం ● పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



శిథిలావస్థలో ఉన్న బుక్కపట్నం ఆర్టీసీ బస్టాండ్

బుక్కపట్నం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అది నిరుపయోగంగా మారింది. ఆ బస్టాండ్‌లోకి బస్సులు రావడం లేదు.. ప్రయాణికులు పోవడం లేదు. ఒకప్పుడు ప్రయాణికులతో కిటకిటలాడిన ఆ బస్టాండ్ .. నేడు కళాహీనంగా మారింది. రూ.కోట్ల విలువ చేసే స్థలంలో నిర్మించిన ఈ బస్టాండ్ నేడు గాడిదలు, కుక్కలకు నిలయంగా మారింది.

● 36 ఏళ్ల క్రితం నిర్మాణం

స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాలకు సమీపంలో దాదాపు ఎకరా స్థలంలో 1988 నవంబరు 18న నాటి గోరంట్ల ఎమ్మెల్యే డాక్టర్ వేలూరు కేశన్న ఈ బస్టాండ్‌ను ప్రారంభించారు. కొన్ని సంవత్సరాల పాటు బస్టాండ్ నిత్యం ప్రయాణీకుల రద్దీతో కళకళలాడింది. ప్రతిరోజు 30కిపైగా బస్సు సర్వీసులు బస్టాండ్ వచ్చేవి. వంద మంది ప్రయాణీకులతో ని త్యం రద్దీగా ఉండేది. బస్టాండ్‌లోని షాపింగ్ కాం ప్లెక్స్, క్యాంటిన్ వ్యాపారులతో బిజీగా ఉండేది. ఈ బస్టాండ్‌కు ఒక కంట్రోలర్ కూడా ఇక్కడ ఉండేవారు.

● పదేళ్లుగా..

నాడు కళకళలాడిని ఈ ఆర్టీసీ బస్టాండ్... గత పది సంవత్సరాల నుంచి క్రమక్రమంగా నిర్లక్ష్యానికి గురైంది. ప్రస్తుతం బస్టాండ్ భవనం చాలా వరకు శిథిలమై.. కూలడానికి సిద్ధంగా ఉంది. క్యాంటిన్, షాపింగ్ గదులను అడిగేవారు లేక మూసివేశారు. బస్టాండ్ బాగోగులను కూడా ఆర్టీసీ సంస్థ పట్టించుకోవడంలేదు. దీంతో బస్టాండ్ గాడిదలు, పశువులకు ఆవాసంగా మారింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ సంస్థ ఏమాత్రం పట్టించుకోకపోవడంతోనే బస్టాండ్‌కు ఈ దుస్థితి పట్టిందని ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బస్టాండ్‌కు మరమ్మతులు చేసి, బస్సు సర్వీసులను బస్టాండ్ గుండా నడిపి పూర్వ వైభవం తీసుకురావాలని కోరుతున్నారు.



బస్టాండ్‌తో తిరుగుతున్న గాడిదలు



నిరుపయోగంగా దుకాణాలు

వినియోగంలోకి తేవాలి



శిథిలావస్థలో ఉన్న బస్టాండ్‌ను ఆర్టీసీ సంస్థ మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలి. రూ. కోట్ల విలువ చేసే భవనాలు, స్థలాన్ని వృథాగా వదిలి పెట్టడం ఆర్టీసీ సంస్థకు తగదు. బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొస్తే స్థానికంగా పలువురికి ఉపాధి దొరుకుతుంది.

-నారాయణస్వామి, మాజీ వైస్ ప్రెసిండెంట్, బుక్కపట్నం

ఇబ్బందుల్లో ప్రయాణికులు



స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మతులు చేసి, పూర్వలా బస్సులు నడిపాలి. అలా చేస్తే ప్రయాణీకులు వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి సులువుగా ఉంటుంది. అలాగే ప్రయాణీకులు నీడ, నీరు, ఆహారం అందుబాటులో ఉంటుంది. ప్రసుత్తం వివిధ ప్రాంతాల్లో బస్సులు ఎక్కాల్సి వస్తోంది. దీని వలన ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు.

- దేశెట్టి రామాంజనేయులు, బుక్కపట్నం

మరమ్మతులు చేయిస్తాం

శిథిలావస్థలో ఉన్న బుక్కపట్నం ఆర్టీసీ బస్టాండ్ భవనానికి మరమ్మతులు చేస్తాం. బస్టాండ్ ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్సులు, క్యాంటిన్ నిర్వాహణకు ఇప్పటికే టెండర్లు పిలిచాం. ప్రతి బస్సును బస్టాండ్‌లో నిలిపి, పూర్తిస్థాయిలో ప్రయాణీకులకు అందుబాటులోకి తెస్తాం.

-మధుసూదన్, ఆర్ఎం

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి: సీఐటీయూ



ధర్మవరం: నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు



కదిరి: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దర్మవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని, పెండింగ్‌లో ఉన్న కార్మిక వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేసి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఇందులో శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండల కో-కన్వీనర్ ఆదినారాయణ, అయూబ్ ఖాన్, హైదరవలీ పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం అందించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, జగన్మోహన్, రామమోహన్, ముస్తాక్, బాబ్‌జాన్, శివప్రసాద్, ఫక్రుద్దీన్, ఫాజిల్, రఫీక్, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించారు ... వదిలేశారు..!

● ఆగిపోయిన భవన నిర్మాణాలు ● ప్రజాధనం వృథా







బొంతలపల్లిలో కడ్డీలకు పరిమితమైన కమ్యూనిటీ హెల్త్ సెంటర్, సచివాలయ నిర్మాణం, పునాదులు కూడా తీయని రైతు సేవా కేంద్రం

తనకల్లు/నల్లమాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తనకల్లు మండలంలోని బొంతలపల్లిలో, నల్లమాడలోని పలు గ్రామాల్లో గత వైసీపీ ప్రభుత్వం సచివాలయం, రైతు సేవా కేంద్ర, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాలను ప్రారంభించింది. కొద్ది రోజుల పాటు నిర్మాణాలు చేపట్టి.. అనంతరం బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఆ నిర్మాణాలు ఆగిపోయాయి. తనకల్లు మండలం బొంతలపల్లిలోని సచివాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పనులను పునాదులకే పరిమితయ్యాయి. రైతు సేవా కేంద్రం నిర్మాణ పనులు అసలు ప్రారంభించనే లేదు. ఇక నల్లమాడ మండలంలో 13 సచివాలయాలున్నాయి. 12 ఆయుష్మాన్ హెల్త్ కేంద్రాలు మంజురయ్యాయి. నల్లమాడ-1, నల్లమాడ-2 బండవాండ్లపల్లి, నల్లమాడ-3 ఎద్దువాండ్లపల్లితండా, పులగంపల్లి, వంకరకుంటలో హెల్త్ కేంద్రాల నిర్మాణాలు పైకప్పువరకు వచ్చి ఆగిపోయాయి. కురవమాల, దొన్నికోట, గోపేపల్లి, చారుపల్లిలో పనులు పునాదుతోనే ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం బిల్లులు సక్రమంగా ఇవ్వకపోవడంలో అసంపూర్తిగా ఈ నిర్మాణాలు ఆగిపోయాయి. ఇలా రూ. లక్షలాది ప్రజాధనం వృథా అయింది. వీటి నిర్మాణాలు పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



కురమాల్లో పిల్లర్లతో నిలిచిపోయిన హెల్త్ కేంద్రం





దొన్నికోట, చారుపల్లిలో పునాది గుంతలతోనే ఆగిన పనులు

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

తనకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మరణించాడు. ఆ వృద్ధుడు రోడ్డు దాటు తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కడిక్కడే మరణించాడు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా.. ఇంకా సమాచారం అందలేదన్నారు. పోలీసుల విచారణలో ఆ మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

బేల్దారిపై హత్యాయత్నం



గాయపడిన చిన్నవలి

తనకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఓ బేల్దారిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి శుక్రవారం రాత్రి దాడి చేశారు. నల్లచెరువు మండలంలోని మల్లి రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్నవలీ బెల్దారి పనిచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. వీరిలో ఒక కుమారుడు అదే గ్రామానికి చెందిన బంధవుల అమ్మాయిని ప్రేమించాడు. ఈ విషయంలో ఇరుకుటుంబాల మధ్య వివాదం మొదలైంది. మూడు రోజులుగా బేల్దారి చిన్నవలీ గ్రామంలో లేకుండా ఇతర ప్రాంతాల్లో సంచరిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తనకల్లు పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న అతనిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడిచేశారు. తీవ్రంగా గాయపడ్డ అతను కిందపడిపోవడంతో ఆ వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. గమనించిన స్థానికులు అతన్ని 108లో కదిరి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. తనకల్లు ఎస్ఐ గోపీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ప్లంబర్ల కమిటీ ఏకగ్రీవం

ధర్మవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్లంబర్స్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. కమిటి గౌరవాధ్యక్షుడిగా ఎర్రంశెట్టి రమణ, అధ్యక్షుడిగా గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, తాజ్, నాగేంద్ర, మన్సూర్, రామసుబ్బయ్య, సహాయకార్యదర్శులుగా శివయ్య, చిన్న, మస్తాన్, సురేంద్ర, సభ్యులుగా సుబ్రమణ్యాం, నాగరాజు, ఇమామ్‌సాబ్, బాలయ్య, దిలీప్‌కుమార్, కాశి, ఆంజినేయులు, శివయ్య, లోకేశ్, మధు, శ్రీకాంత్, చంద్రశేఖర్, నూరుద్దీన్, రామాంజినేయులు, సుబ్బయ్య, ద్వారకను ఎంపికచేశారు.



నూతన కమిటీ సభ్యులు, నాయకులు

ఉత్సాహంగా హోలీ వేడుకలు

ధర్మవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయం వద్ద శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ఆధ్వర్యంలో నాయకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని శారదానగర్‌లో కూడా సుగాలీలు రంగులు చల్లుకుంటూ హోలీ జరుపుకున్నారు.

● తనకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో హోలీ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ప్రత్యేకించి గిరిజన తండాల్లో హోలీ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొన్ని తండాల్లో జ్యోతులు మోసి, మొక్కులు తీర్చుకున్నారు. రంగులు చల్లుకుని, విందుభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

● కదిరిఅర్బన్: స్థానిక ఎన్జీఓ కాలనీలో శుక్రవారం బంజార ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నపెద్ద తేడాలతేకుండా రంగులు చల్లుకుని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బంజార ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● గాండ్లపెంట: మండలంలోని గిరిజన తండాల్లో హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సిఎం తండా, పచ్చారుమేకలతండా, గాజులవారిపల్లి, పెద్దతండా, నల్లగుట్ట తండా, తుమ్మలబైలుపెద్దతండా, బనాన్‌చెరువుపల్లితండా తదితర తండాలో హోలీవేడుకలు జరుపుకున్నారు.





ధర్మవరం : హోలీ వేడుకల్లో బీజేపీ నాయకులు, శారదానగర్‌లో సంబరాలు

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

కదిరిఅర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజా బేగం హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ స్కానింగ్ సెంటర్లను, ఏరియా ఆసుపత్రులను తనిఖీ చేశారు. నార్మల్ ప్రసవాలే చేయాలని, అత్యవసరమైతే సిజరిన్ చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఏరియా ఆసుప్రతి సూపరెంటెండెంట్ హుస్సేన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రేపు ఘంటసాల వర్ధంతి

ధర్మవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కళాజ్యోతి ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం పద్మశ్రీ ఘంటసాల వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు కళాజ్యోతి సంస్థ కార్యదర్శి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ హేమంత్ కుమార్ పాల్గొంటారని, రాత్రి 7 గంటలకు ప్రముఖ గాయకుడు బాల కామేశ్వరరావు, తదితరుల పాటల కచేరి ఉంటుందన్నారు.

వైభవం.. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం

చిలమత్తూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా సాగింది. రథోత్సవాన్ని వీక్షించడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూల విరాట్టును రథంపై ఆశీనులను చేసేందుకు సిద్ధం చేశారు. సంప్రదాయ ప్రకారం స్వామివారిని రథం వద్దకు తీసుకెళ్లేందుకు మండల అధికార, ప్రజాప్రతినిధులను స్వాగతంతో ఆలయానికి తీసుకురావడం ఆనవాయితీ. వారిని మంగళవాయిద్యాలతో వెళ్లి ఆలయానికి తీసుకువచ్చారు. స్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో స్వామివారిని పూలపల్లకిలో అర్చకులు తమ భుజాలపై రథం వద్దకు తీసుకువచ్చారు. రథం ముందు హోమాల అనంతరం పూల పల్లకిలో వచ్చిన స్వామివారిని రథం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అక్కడ నుంచి స్వామిని రథంపై ఆశీనులను చేశారు. వేలాది భక్తుల గోవింద నామ స్మరణల మధ్య రథాన్ని లాగారు. స్వామిని భక్తులు దర్శించుకొని దవనం, అరటిపండును స్వామివారికి సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా ఎస్.ఐ మునీర్ అహమ్మద్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ యాదవ్ బృందం బలిజ సంఘం తదితర కులసంఘాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రథోత్సవానికి టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్, నాగరాజు, స్థానిక నాయకులు రంగారెడ్డి, నాగరాజుయాదవ్, బేకరీ గంగాధర్, సోమశేఖర్, గౌరీశంకర్, బాలాజీ, అశ్వత్థప్ప, నందీషప్ప రథోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.


భక్తజన సందోహం మధ్య కదులుతున్న రథం


ఆలయం నుంచి రథం వద్దకు స్వామి వారిని పల్లకిలో తీసుకువస్తున్న భక్తులు

ఘనంగా కనుమ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

పావగడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవి సమేతుడై కనుమలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వేలాది మంది భక్తుల నడుమ అంగరంగ వైభవంగా సాగింది. మధ్యాహ్నం వేద పండితులు నిర్ణయించిన ముహూర్తానికి ఉత్సవ విగ్రహాలను రథోత్సవంపై ఉంచి ఆలయ కమిటీ అధ్యక్షుడు, దేవదాయ శాఖ అధికారులు రథాన్ని లాగి ప్రారంభించారు. ఆలయం ముందు రథం ఊరేగుతుండగానే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అరటిపళ్లు సాంబ్రాణి రథంపై విసిరి తమ మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మరథోత్సవం సందర్భంగా శ్రీవారి గరుడ సేవా సమితి పావగడ, హిందూపురం సేవకుల ఆధ్వర్యంలో అన్నదానం, మజ్జిగ, పెసరబ్యాళ్లు పంపిణీ చేపట్టారు. కమిటీ సభ్యులు వెంకటస్వామి, నాగేష్, మురళి, రత్నమ్మ, చలపతి, వెంకటేశ్, శ్రీనివాస్, మంజు, హనుమంతరాయప్ప ఉత్సవంలో పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.


కనుమలో రథాన్ని లాగుతున్న భక్తులు

పేరుకే నగర పంచాయతీ..!

- ప్రజాసమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం
- కోనాపురంలో ఏళ్లుగా తాగునీటి సమస్య
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పెనుకొండ రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అయితే తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న కలలు కలలుగానే మిగిలిపోతున్నాయని పలు కాలనీ ప్రజలు అంటున్నారు. పేరుకే నగర పంచాయతీ అని, పెనుకొండ నగర పంచాయతీ కోనాపురం, ఇస్లాపురం, తిమ్మాపురం గ్రామస్థులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా వేసవి వచ్చిందంటే తాగునీటి కోసం బోరుబావులవద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని, బిందె నీటి కోసం పనులు మానుకుని కొళాయిలవద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందని అంటున్నారు. 2020లో పెనుకండ నగర పంచాయతీగా ఏర్పడింది. నగర పంచాయతీ కోనాపురం, కొండాపురం, మంగాపురం, వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురం, తిమ్మాపురం గ్రామాలను నగరపంచాయతీలో విలీనం చేశారు. తాగు, సాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు కొట్టుమిట్టాడుతున్నామన్నారు. కోనాపురం గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కోనాపురంలో 300 కుటుంబాలు, 1800మందికిపైగా జనాభా ఉంది. గ్రామానికంతా మూడు బోరుబావులు ఉండగా అరకొరగా నీరు వస్తుండటంతో రోజూ పనులు వదులుకుని గంటల తరబడి కొళాయివద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పండుగపూట నీటి కోసం ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోనాపురం, ఇస్లాపురం, తిమ్మాపురం గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై కమిషనర్ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా నగర పంచాయతీ గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్యలేకుండా చర్యలు చేపడతామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాల్లో బోరుబావులు తవ్వించి సమస్యలేకుండా చూస్తామన్నారు.


కోనాపురంలో అరకొరగా వచ్చే నీటిని పట్టుకుంటున్న మహిళలు

రైతులను ప్రోత్సహించేందుకే ఎడ్లబండ్ల పోటీలు

గోరంట్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న రైతుల్లో సంతోషాన్ని నింపేందుకే ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు శంకర్‌లాల్ నాయక్ తెలిపారు. మండలంలోని కరావులపల్లితండా అభయాంజనేయస్వామి ఆలయ ధర్మకర్త శంకర్‌లాల్‌నాయక్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతియేటా శ్రీరామనవమి పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయం వద్ద ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.70వేలు, మూడవబహుమతి రూ.50, నాలుగో బహుమతి రూ.40వేలుగా నిర్ణయించామన్నారు. ఏప్రిల్ 5లోపు రూ.2 వేలు చెల్లించి పేర్లు మోదు చేయించుకోవాలన్నారు. ఆయనతోపాటు జడ్పీటీసీ పాలే జయరాంనాయక్, నాగేనాయక్, గంపల రమణారెడ్డి, శివారెడ్డి, రాజేష్‌నాయక్, వాసునాయక్, నారాయణస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శంకర్‌లాల్‌నాయక్

చెడుపై సాధించిన విజయానికి చిహ్నం హోలీ


మడకశిరలో చిన్నారుల సందడి

హిందూపురం అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చెడుపై సాధించిన విజయానికి గుర్తుగా హోలీ పండుగను జరుపుకుంటారు. శుక్రవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో యువత, చిన్నా, పెద్ద, మహిళలు రంగులు చల్లుకుని హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఉదయం నుంచే రంగులు చల్లుకుంటూ వీధుల్లో సందడి చేశారు. పట్టణంలోని కంసలపేట, వక్కలబజార్, శ్రీకంఠపురం, మోడల్ కాలనీ, లక్ష్మీపురం, నానెప్పనగర్, ముక్కడిపేట, మెయిన్‌బజార్ తదితర ప్రాంతాల్లో హోలీ నిర్వహించారు. తూమకుంట పారిశ్రామిక వాడలో బీహారీలు రంగులు చల్లుకుని వేడుకల్లో పాల్గొన్నారు.

మడకశిర టౌన్: మడకశిర పట్టణంలో హోలీ పండుగను పురస్కరించుకొని రంగులు చల్లుకొని యువత సంబరాలు చేసుకున్నారు. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొంటూ ఉత్సాహంగా హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

ఆహ్లాదం పంచని పార్కులు..!

- 25 రోజులుగా ఎక్కడి చెత్త అక్కడే..
- ఇబ్బంది పడుతున్న హౌసింగ్ బోర్డు ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

హిందూపురం అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదం, ఆరోగ్యం కోసం పార్కులకు వెళితే, అక్కడ ఆహ్లాదం అటుంచితే అనారోగ్యం బారిన పడేలా ఉందని పాదచారులు, హౌసింగ్ బోర్డు ప్రజలు అంటున్నారు. ఉదయం, సాయంత్రం కాస్త వ్యాయామం, నడక మంచివని వైద్యులు పదేపదే చెబుతున్నారు. దీనికి తోడు ఎండవేడిమికి కాస్త ఊరట లభిస్తుందని పార్కుల్లో అయితే చెట్లు ఉంటాయని చిన్న పిల్లలతో పాటు వృద్ధులు, పెద్దలు పార్కులకు వెళ్తుంటారు. అక్కడికి వెళితే ఆరోగ్యం సంగతి దేవుడెరుగు అనార్యోంబారిన పడకుండా ఉంటే చాలు అనేలా పార్కు తయారైందని స్థానికులు అంటున్నారు. పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.లక్షలు వెచ్చించి పిల్లలకు ఆటవస్తువులు ఏర్పాటు చేశారు. అలాగే వృద్ధులు, ప్రజలు నడిచేందుకు ట్రాక్ ఏర్పాటు చేశారు. అంత వరకు బాగానే ఉంది. కానీ 25 రోజులుగా పార్కు శుభ్రం చేయడంలేదని, ఎక్కడి చెత్త అక్కడే ఉందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది కానీ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగే కొనసాగితే పార్కు మూతపడక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇలాంటప్పుడు ఎందుకు లక్షలు వెచ్చించి పార్కులు ఏర్పాటు చేశారని నిలదీస్తున్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్‌కు పలుమార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు.


సేద తీరే చెట్టు కింద ఇలా..


చెత్తాచెదారం మధ్యనే ఆడుకుంటున్న పిల్లలు

ఇలాగైతే ఎలా?: ప్రభుకుమార్, స్థానికుడు



పచ్చదనంతో ఆహాదకరంగా ఉండాల్సిన పార్కు చెత్తాచెదారంతో కలుషితంగా మారింది. 25 రోజులుగా ఇలానే ఉంది. సాయంకాలం, ఉదయం కాస్త రిలీఫ్ కోసం ఇక్కడకు వస్తాం. అపరిశుభ్రంగా ఉండటంతో ఇక్కడ కూర్చోలేక పోతున్నాం. ఇంతకుముందు ప్రతి రోజు శుభ్రం చేసేవారు. ప్రస్తుతం పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇలాగైతే ఎలా? ఇక్కడకు వస్తే అనారోగ్యాలు కొనితెచ్చుకున్నట్టే.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో కదిరి పౌర్ణమి


ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి

మడకశిర రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో కదిరిపౌర్ణమిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి నరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్,మాజీ మంత్రి రఘువీరారెడ్డి దంపతులు ఉత్సవాల్లో పాల్గొని స్వామికి పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మడకశిరటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎం.ఎస్.రాజు కలిశారు. అమరావతి ప్రాంతంలోని వెంకటపాళ్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 15వ తేదీన నిర్వహించనున్న శ్రీనివాస కల్యాణానికి హాజరుకావాలని ముఖ్యమంత్రిని టీటీడీ బోర్డు ఛైర్మన్ బి.ఆర్.నాయుడుతో కలిసి ఆహ్వానించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం చంద్రబాబుతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా మాట్లాడి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న డాక్టర్ సరోజినీదేవి

మడకశిర రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆర్ అనంతపురంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సరోజినీదేవి మొక్కలు నాటారు. ఆమె మాట్లడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.

పాఠశాలలకు వాటర్ క్యాన్‌ల వితరణ


వాటర్‌క్యాన్లు అందజేస్తున్న నాయకులు, అధికారులు

హిందూపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్ళి ఆనంద్‌కుమార్ వాటర్ క్యాన్లు వితరణ చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, కమిషనర్ శ్రీనివాసులు హాజరై వాటర్ క్యాన్‌లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఎంఈఓ గంగప్ప, మండల కన్వీనర్ అశ్వత్థనారాయణ, సర్పంచ్ మంజునాథ్, నాయకులు, రామకృష్ణ, గోపాల్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

- 2,360 మంది విద్యార్థులు, 13 సెంటర్ల ఏర్పాటు

మడకశిర టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. 2360 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 13 సెంటర్లను ఏర్పాటు చేశారు. పట్టణంలో ఐదు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ తెలిపారు. ఐదు సెంటర్ల పరిధిలో 1154 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అందుకు 68 మంది ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. అగళిలో రెండు సెంటర్లు, గుడిబండ రెండు, అమరాపురం మూడు, రొళ్ల రెండు సెంటర్లలో పరీక్షలను రాసేందుకు సిద్ధం చేశారు. ఎంఈఓ శ్రీనివాస భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తాగునీరు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

గోరంట్ల: మండలంలో 17నుంచి జరగనున్న పదిపరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు జాన్‌రెడ్డెప్ప, గోపాల్ శుక్రవారం తెలిపారు. మండలంలో 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గిరిజన గురుకులపాఠశాల, ఖాజాపురం కేజీబీవీతో పాటు ప్రయివేటు పాఠశాలలకు చెందిన 1,170మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష సమయాల్లో మండల వ్యాప్తంగా జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యల చేపట్టామన్నారు.

లేపాక్షి: మండలంలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా మూడు పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 725మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, బెంచీలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

నేడు సాయికాళేశ్వర్ వర్ధంతి

పెనుకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శివసాయి మందిరం వ్యవస్థాపకులు డా.సాయికాళేశ్వర్ 13వ వర్ధంతిని శనివారం నిర్వహిస్తున్నట్లు షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం స్థానిక కాళేశ్వర్ ఆశ్రమంలోని ఆయన సమాధివద్ద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అందరూ పాల్గొని ఆయనకు నివాళులు అర్పించాలని కోరారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి రథోత్సవం


పూజలు నిర్వహిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీ కొడిగేపల్లి గ్రామంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, కార్యదర్శి శ్రీనివాస మూర్తి రథోత్సవంలో పాల్గొన్నారు. అనంతం స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు లక్ష్మీనారాయణ, కోట్ల రంగేగౌడ్ పాల్గొన్నారు.

రొళ్లలో లక్ష్మీనరసింహస్వామి...


రథాన్ని లాగుతున్న భక్తులు

రొళ్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచి సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య రథంలో అధిష్ఠింపచేశారు. భక్తులు అరటిపండ్లు, బొరుగులు రథంపై వేస్తూ మొక్కుబడులు చెల్లించుకొన్నారు.

కైవారం తాతయ్య జయంతి


పూజల్లో పాల్గొన్న శ్రీదికాయక యోగీజీ స్వామి

గోరంట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి మారెమ్మ ఆలయంలో కైవారం తాతయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రాపటానికి పూజలుచేసి, భజన బృందం భక్తిగీతలు ఆలపించారు. గోపూజ తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు దేవిస్వామి నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్ణాటక రాష్ట్రం శైలాపురానికి చెందిన శ్రీదికాయకయోగీజీ హాజరయ్యారు. ప్రతియేటా తాతాయ్య జయంతిని బలిజ సంఘం నాయకుడు గంగాధర్, ప్రమీల దంపతులు చేపట్టడం ఆనవాయితీ. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం


పార్టీ జెండాను ఎగురవేస్తున్న జనసేన నాయకులు

గోరంట్ల, మార్చి14(ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం గోరంట్లలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై పార్టీ జెండాలతో ద్విచక్రవాహన ర్యాలీచేశారు. పవన్‌కల్యాణ్ అనంతరం బస్టాండ్ ప్రాంతంలో కేక్‌కట్ బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. మండల కన్వీనర్ సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్, అనిల్‌కుమార్ యాదవ్, కావేరి, నగేష్, రాఘవ, నాగేంద్ర, రామాంజి, రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

హిందూపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌కు చెందిన మతిస్థిమితం లేని పూజిత అనే మహిళను హిందూపురం పోలీసులు రక్షించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. మూడు రోజుల కిందట పూజిత ఇంటి నుంచి వచ్చి, భువనేశ్వర్-బెంగళూరు రైలు ఎక్కింది. రైలులో పక్కసీటులో కూర్చున్న బెంగళూరుకు చెందిన వారి నుంచి సెల్‌ఫోన్ తీసుకుని బంధువులతో మాట్లాడింది. ఆ తరువాత కొద్దిసేపటికి పూజిత బంధువులు అదే నంబరుకు ఫోన్‌చేయగా ఆమె హిందూపురం రైల్వే స్టేషన్‌లో దిగిపోయిందని చెప్పారు. దీంతో పూజిత భర్త సుమన్‌రాయ్ పశ్చిమబెంగాల్‌లోని తమ జిల్లాకు సంబంధించిన ఎస్పీ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లాడు. అక్కడి ఎస్పీ శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్నకు ఫోన్‌చేసి సమాచారం చేరవేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ మహేష్ నేతృత్వంలో టూటౌన్ సీఐ కరీం, వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్ మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆమె హిందూపురం రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి సమాచారాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా ఎస్పీ పశ్చిమబెంగాల్ పోలీస్ అధికారులతో మాట్లాడి పూజిత హిందూపురంలో ఉందని చెప్పారు. వారు శుక్రవారం హిందూపురానికి వచ్చి ఆమెను తీసుకెళ్లారు.

వక్క చెట్లకు నిప్పు

అగళి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలం పి బ్యాడిగెర గ్రామ పంచాయతీకి చెందిన బడ్డి గొడ్డి మల్లప్ప పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు ఒక్క చెట్లకు నిప్పుపెట్టారు. మూడు ఎకరాల 54 సెంట్ల భూమిలో 81 ఒక్కచెటు, 50టెంకాయ చెట్లు, 26 అరటి చెట్లు, మూడు రోళ్ల డ్రిప్ పైపులు కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు. కష్టపడి పెంచుతున్న వక్క, టెంకాయ, అరటి చెట్లు కాలిపోయాయని వాపోయాడు. అరకొర నీటితో పెంచుకున్నానని అయితే గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారన్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని విన్నవించారు.

గుర్తుతెలియని మహిళ పుర్రె లభ్యం

మడకశిర రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్రేపల్లి గ్రామ సమీపం భూతప్ప కనుమ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ పుర్రె ఆనవాళ్లను శుక్రవారం పశువుల కాపర్లు గుర్తించారు. ఇసుకలో పూడ్చి పెట్టిన మహిళ శవాన్ని కుక్కలు పీకుతుండగా కాపర్లు చూసి గ్రామ ప్రజలకు సమాచారం అందించారు. భూతప్ప కనుమలో గుర్తుతెలియని మహళ పుర్రె ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గమనించిన ట్రైనీ డీఎస్పీ ఉదయ పావని, రూరల్ సీఐ రాజ్‌కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లి మహిళ పుర్రెను పరిశీలించించారు. పూడ్చిన మహిళ శవాన్ని శనివారం బయటకు తీస్తామని పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

మడకశిర రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పత్తికుంట గ్రామనికి చెందిన నాగమణి (39) అనే మహిళ గురువారం రాత్రి గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ ముత్యాలప్ప తెలిపారు. అదే గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప కొడుకులు, హనుంతేగౌడ్, నాగభూషణ తరచూ నాగమణితో గొడవ పడుతుండేవారు. గురువారం సాయంత్రం వారు నాగమణిని నానా దుర్భాషలాడటంతో మనస్థాపంతో ఆమె ఇంటి సమీపంలో ఉన్న చింత చెట్టుకు ఉరివేసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. భర్త నరసంహమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.